


నేటితో డీఎస్సీ సర్టిఫికెట్ల

పరిశీలనకు తెర

- ఖమ్మం జిల్లాలో 1075 మందికి, భద్రాద్రి జిల్లాలో 852 మందికి పూర్తి 6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

5

శనివారం, 5 అక్టోబరు 2024



టన్ను గంజాయి

దహనం

గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

6

22 కేసుల్లో పట్టుబడిన రూ.4కోట్ల విలువైన నిషేధిత మత్తుపదార్థం



కిష్టారంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

కిష్టారం వాసులకు అండగా ఉంటాం...

- సింగరేణి గనుల దుష్ప్రభావాల నుంచి ప్రజలను ఆదుకుంటాం
- దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేయిస్తాం
- కాలుష్యం నివారణకు అవసరమైన చర్యలు చేపడతాం: కలెక్టర్
- సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయితో కలిసి పర్యటన 6

మెడికల్ మాఫియా...



- ఖమ్మంలో పలు ప్రైవేటు ఆస్పత్రుల మాయాజాలం
- సీజ్ చేసిన వారాల వ్యవధిలోనే వస్తున్న అనుమతులు
- క్రిమినల్ కేసులున్న వాటికి పేరుమార్చి వ్యవహారం
- వైద్య, ఆరోగ్యశాఖలో అక్రమార్కుల వత్తాసు
- పెద్ద ఎత్తున దందా..
- నివ్వెరపరుస్తున్న లోగుట్టు....

సీజ్ అయిందా.. నో టెన్షన్!

పేరు మార్చుకొని మళ్లీ ఓపెన్ అవుతున్న ప్రైవేటు ఆస్పత్రులు

అవసరమైతే అబార్షన్లు చేస్తాం.. కాసులిస్తే కాటికి పంపే ఇంజక్షన్లు సప్లై చేస్తాం.. అనుమతులు లేకున్నా ఎలాంటి అక్రమానికైనా వడిగడతాం. ఇది గత కొన్నేళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిర్వహిస్తున్న దందా. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉక్కుపాదం మోపి నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటారు. తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేస్తారు. ఆసుపత్రులను కూడా సీజ్ చేస్తారు. అయితే ఇదంతా నాణానికి ఒకవైపేనన్న వాదన వినిపిస్తోంది. ఆసుపత్రులు అనుమతుల నుంచి మొదలుకుని వాటి నిర్వహణ వరకు అడుగడుగునా కాసుల దందా సాగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖమ్మం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలల క్రితం వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఖమ్మం నగరంలో బోనకల్ రోడ్డులోని ఓ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో అబార్షన్లు చేసేందుకు ఇద్దరు మహిళలను సిద్ధంగా ఉంచగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే సదరు ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆ సమయంలో మరికొన్ని కీలక ఫైళ్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఆ సంఘటనకు కొద్ది రోజులముందు వైరా రోడ్డులోని మరో ఆసపత్రిలోనూ అబార్షన్లు నిర్వహిస్తున్న విషయాన్ని నిర్ధారించుకుని యాజమాన్యంపై కేసు నమోదు చేసి సీజ్ చేశారు. ఆ సమయంలో అదే బిల్డింగ్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మరో రెండు ఆసుపత్రులను కూడా మూయించారు.

అయితే క్రిమినల్ కేసులు నమోదు చేసిన సదరు ఆస్పత్రులకు మళ్లీ అనుమతులివ్వడం కొసమెరుపు. ఒకటి రెండు ఆసుపత్రులు కాదు.. ఇలా పదుల సంఖ్యలో సీజ్ అయిన ఆసుపత్రులు, ల్యాబ్‌లు తెరుచుకోవడం పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకుగాను వైద్యఆరోగ్యశాఖలో గతంలో పనిచేసిన అధికారి పెద్దఎత్తున ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. సదరు అధికారే ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి, ఆ అధికారే సీజ్ చేయడం ఒక ఎత్తయితే.. అదే అధికారి మళ్లీ ఆయా ఆస్పత్రులకు అనుమతులిచ్చారని, దాని వెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. అంతేకాదు గతంలో ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు ఇంజక్షన్ మర్డర్లలోనూ ఆసుపత్రులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పేరు మార్చి పనికానిచ్చేస్తున్నారు..

నిబంధనలు సక్రమంగా నిర్వర్తించని ఏ ఆస్పత్రిని అయినా వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి ఆయా ఆస్పత్రిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అందులో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా తనిఖీలు నిర్వహించేవారు. అలాంటి సమయంలో నిబంధనలు పాటించని ఆస్పత్రులు, ల్యాబ్‌లను సీజ్ చేయడం, మరి కొన్ని ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సర్వసాధారణమే. అయితే అలా సీజ్ చేసిన తర్వాత, నోటీసులు జారీ చేసిన విషయాన్ని మాత్రం గొప్పగా చూపించే అధికారులు.. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా అవే ఆస్పత్రులకు అనుమతులు మంజూరు చేస్తున్న అంశం యేళ్లతరబడి సాగుతున్నట్టుగా తెలుస్తోంది. అధికారులు సీజ్ చేసిన ఆస్పత్రి స్థానంలో మరో పేరుతో ఆస్పత్రిని నెలకొల్పుతున్నట్టుగా తెలుస్తోంది.

అదే సిబ్బంది, అదే యాజమాన్యం ఆసుపత్రిని నిర్వహిస్తుండగా.. మరొకరి పేరుమీద సర్టిఫికేటు పొందుతున్నారు. అందుకు అధికారులు సైతం కాసులు తీసుకుని కళ్లుమూసుకుని సంతకాలు చేసేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసులు నమోదైన ఆసుపత్రులకు సైతం మళ్లీ అనుమతులు ఇచ్చినట్టుగా తెలుస్తోంది. దాన్ని అలుసుగా తీసుకుంటున్న పలు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాటగా తమ దందా కొనసాగిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ప్రైవేటు (మిగతా 6వ పేజీలో)



కలెక్టరేట్‌లో బతుకమ్మ సందడి

ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 4: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మూడో రోజు శుక్రవారం ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మలకు వైద్యాధికారి డాక్టర్ వి.సుబ్బారావు పూజలు నిర్వహించారు. అనంతరం పాలు, చక్కెర, పెసలు, సత్తుపిండి, బెల్లంతో నైవేద్యం సమర్పించారు. పెద్ద ఎత్తున ఉద్యోగులు, మహిళలు వేడుకల్లో పాల్గొని గౌరమ్మ తల్లిని పూజించి, ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సైదులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- మెడికల్ కళాశాలలో కూడా శుక్రవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మలకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు పూజలు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థినులు ఆడిపాడారు. ఈ వేడుకల్లో ఆర్ఎంవో డాక్టర్ కళావతిభాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



పచ్చని అడవులపై చిందిన నెత్తురు

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టుల హతం
- ఉలిక్కిపడిన సరిహద్దు అడవులు
- బిక్కుబిక్కుమంటున్న ఏజెన్సీ గ్రామాలు
- అప్రమత్తమైన పోలీసులు

చర్ల, అక్టోబరు 4: ఛత్తీస్‌గఢ్ అడవులు నెత్తురోడాయి. నారాయణ పూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు హతం కావడంతో ఏజెన్సీ పల్లెలు ఉలిక్కిపడ్డాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని అటవీ గ్రామాలు బిక్కు బిక్కుమంటున్నాయి. నారాయణపూర్, దంతెవాడ సరిహద్దు నెందూర్, తులతులి అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఇరుజిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ బలగాలకు చెందిన సుమారు 1200మంది సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. శుక్రవారం ఉదయం అబూజ్‌మడ్‌లోకి బలగాలు ప్రవేశించగానే మావోయిస్టులకు, బలగాలకు మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్లు తెలిసింది.

అనంతరం అడవుల్లో గాలించగా 28మంది మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయి. ఈ సంఘటనలో పోలీసు బలగాలు తుపాకులు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. కాగా, చనిపోయిన మావోయిస్టులను గుర్తించాల్సి ఉంది. ఈ సంఘటనను ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ అధికారికంగా ధ్రువీకరించారు. 28మంది చనిపోయినట్టు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఇదిలావుండగా, ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది మావోయిస్టులా, గ్రామస్థులా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కాంకేర్ జిల్లా అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29మంది మావోయిస్టులు మృతి చెందగా, అప్పుడు గ్రామస్థులను బలగాలు పట్టుకుని చంపాయనే ఆరోపణలు వచ్చాయి. తాజా ఎన్‌కౌంటర్‌లో కూడా అదే జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాగా, ఈ సంఘటనలో ఈస్ట్ బస్తర్ డివిజన్ ఇంద్రావతి ఏరియా కమిటీ పీఎల్‌జీఏకు చెందిన ఆరుగురు బెటాలియన్ సభ్యులు మృతి చెందినట్లు తెలుస్తోంది. తాజా ఎన్‌కౌంటర్‌తో ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో వున్న భద్రాద్రి జిల్లా అడవుల్లోని పోలీసు బలగాలు అప్రమత్తమ య్యాయి. ఏజెన్సీ అంతటా ఉద్రిక్త మేఘాలు కమ్ముకున్నాయి.

అభయమొసగే ఆదిలక్ష్మి

- భద్రాద్రిలో శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



భద్రాచలం, అక్టోబరు 4: భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీతాయారు ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత లక్ష్మీతాయారు అమ్మవారు మూలవరులకు పంచామృతాలతో ప్రత్యేకస్నపనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఆదిలక్ష్మి అలంకారం ధరింపజేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఈ సమయంలో సామూహిక కుంకుమార్చన, విష్ణుసహస్ర నామ పారాయణం, బాలకాండ పారాయణాన్ని రామాయణ పారాయణదారులు ఎన్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు నిర్వహించారు. అదేవిధంగా చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో అధికసంఖ్యలో భక్తులు ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు పాల్గొన్నారు. లక్ష్మీతాయారు అమ్మవారు నేడు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సిరిపురంలో సోలార్ వెలుగులు

- రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా మధిర నియోజకవర్గంలో అమలు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ
- ఇక్కడ విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడి



సిరిపురంలో ఇళ్లను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మధిర, అక్టోబరు 4: మధిర మండలంలోని సిరిపురంలో సోలార్ వెలుగులు కాంతిలీననున్నాయి. రాష్ట్రంలో కరెంట్ సమస్యల పరిష్కారంలో భాగంగా సౌర విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్రప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను రూపొందిస్తోంది. అందులో భాగంగా డిప్యూటీ సీఎం చొరవతో పర్యావరణంతోపాటు ఉచితంగా నాణ్యమైన కరెంట్ ప్రజలకు, రైతులకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రయోగాత్మకంగా మొదటగా మధిర నియోజకవర్గంలోని సిరిపురంలో పైలట్ ప్రాజెక్టు అమలుచేస్తోంది. ఇది విజయవంతమైతే రాష్ట్రంలోని మిగిలిన అన్ని గ్రామాలకు విస్తరించనున్నట్టు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ జీ వరుణ్ రెడ్డి తెలిపారు. దీంతోపాటు ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లి గ్రామంలోనూ అమలుచేయనున్నట్టు తెలిపారు. శుక్రవారం ఆయన సోలార్ పవర్ శాఖ జిల్లా మేనేజర్ జేఎస్ఎన్ మూర్తి, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సిరిపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులతో సమావేశమై సోలార్ సిస్టంపై అవగాహన కల్పించారు. ఈ వ్యవస్థపై ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామం మొత్తం గృహాలు, వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ వ్యవస్థ ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఇళ్లు, పొలాల్లో సౌర విద్యుత్ ఏర్పాటుపై సర్వే జరుపుతున్నట్టు తెలిపారు. రైతులకు ఉచిత సౌర పంపుసెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ పథకం పూర్తయితే గ్రామంలో పూర్తిగా నూరుశాతం సోలార్ వెలుగులు ప్రసరించనున్నాయి. ప్రజలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే ఏర్పాటుచేస్తుండటంపట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

సిరిపురంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అందుకు ఇప్పటినుంచే కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న తమ శాఖ సిబ్బంది సర్వే కార్యక్రమానికి గ్రామస్తులంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోలార్ పవర్ శాఖ జిల్లా మేనేజర్ జేఎస్ఎన్ మూర్తి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఏ సురేందర్, డీఈ హీరాలాల్, ఏడీఈ అనురాధ, ఏఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లేఅవుట్ అనుమతులు పక్కాగా ఉండాలి..

- కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ



లేఅవుట్‌లను పరిశీలిస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కలెక్టర్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: లేఅవుట్ అనుమతులు జారీ చేసే సమయంలో ఇరిగేషన్, ల్యాండ్ సర్వే, రెవెన్యూ, పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భవిష్యత్‌లో ప్రజల నివాసాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అనుమతులు జారీ చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. కేఎంసీలో శుక్రవారం జిల్లా లేఅవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుడా పరిధిలోని ఐదు లేఅవుట్ అనుమతులను కమిటీ సభ్యులు పరిశీలించారు. అనుమతిలో రహదారుల ప్లానింగ్ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అనుమతుల జారీ సందర్భంగా లోటైనా సమీక్ష చేశారు.

12న ఆయిల్‌పామ్ రైతుల రాష్ట్ర స్థాయి సమావేశం

అశ్వారావుపేట, అక్టోబర్ 4: ఈనెల 12వ తేదీన అశ్వారావుపేటలో ఆయిల్‌పామ్ రైతుల రాష్ట్ర స్థాయి సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయనలతో పాటు పలువురు ఆయిల్‌ఫెడ్ అధికారులు అశ్వారావుపేట ఆయిల్‌ఫ్యాక్టరీలో నిర్మాణం జరుగుతున్న పవర్ ప్లాంట్ పనులను పరిశీలించారు. పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల ప్రతీ యేటా ఆయిల్‌ఫెడ్‌కు రెండు కోట్ల మేర విద్యుత్ బిల్లులు ఆదా అవుతుందన్నారు. రూ.30కోట్లతో 2.5 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించినట్లు ఆయన తెలిపారు. 12 న జరిగే పామాయిల్ రైతుల సమావేశానికి ఏపీకి చెందిన రైతు ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. సమావేశం వల్ల ఇతర పంటలు సాగుచేస్తున్న రైతులు పామాయిల్‌వైపునకు మరిలే అవకాశం ఉందని అన్నారు. ఈయనతో పాటు ఆయిల్‌ఫెడ్ అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణ, కళ్యాణ్, నాగరాజు తదితరులు ఉన్నారు.


ప్లాంట్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గాజాపై ఇజ్రాయెల్ మారణకాండ నిలిపివేయాలి

- 7న నిర్వహించే రాష్ట్రవ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ఖమ్మంటౌన్, అక్టోబరు 4: పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని నిరసిస్తూ ఈనెల 7న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ర్యాలీలకు వామపక్షాలు పిలుపునిచ్చాయని, ఆ కార్యక్రమంలో ప్రజాస్వామ్యవాదులు, శాంతికాముకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం సుందరయ్యభవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్న తమ్మినేని మాట్లాడుతూ ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించి ఏడాది కావస్తుందని, మహిళలు, పిల్లలతో సహా 50వేలకు పైగా ప్రజలు మృతి చెందారని, లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా, పశ్చిమ దేశాల అండతో ఇజ్రాయెల్ నరమేధానికి తెగబడుతుందని, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానాల ఆదేశాలను ఉల్లంఘిస్తుందన్నారు. దీంతో మరింత రెచ్చిపోయి లెబనాన్, ఇరాన్‌లకు యుద్ధాన్ని విస్తరిస్తోందని, పశ్చిమాసియాలో పరిస్థితులు ప్రపంచశాంతికి ప్రమాకరంగా మారుతున్నాయన్నారు.ప్రధాని మోడీ ఇజ్రాయెల్‌కు పరోక్షంగా సహకరిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, పొన్నం వేంకటేశ్వరరావు, మాచర్ల భారతి, కళ్యాణం వేంకటేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, వై. విక్రమ్, భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలతో అందమైన ఆకృతులు

- ఆళ్లపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి చొరవ

ఆళ్లపల్లి, అక్టోబరు 4: చుట్టూ ఉండే పరిసరాల్లో వ్యర్థాలుగా ఉన్న, వృథాగా పడేసిన ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగంలోకి తీసుకవచ్చారు ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలైన ఖాళీవాటర్‌బాటిల్స్, టైర్లు, డబ్బాలను డంపింగ్‌యార్డ్‌లో వేస్తున్నారు. చాలా వరకు వీధుల్లోకి ప్లాస్టిక్ సామగ్రిని విసిరేస్తుంటారు. దీన్ని గమనించిన శిరీష వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలనుకున్నారు. పంచాయతీ సిబ్బంది కి సలహాలు ఇస్తూ రంగులు వేసి, ఆళ్లపల్లి పంచాయతీ కార్యాలయం ముందు పూల మొక్కలకు, చెట్లకు కుండీలుగా అందంగా ఏర్పాటు చేశారు. దాంతో గ్రామపంచాయతీ, ఎంపీడీవో, పాఠశాలకు, సెర్ప్ కార్యాలయాలకు వచ్చేవారికి చూడముచ్చగా కనిపిస్తున్నాయి.





డాక్యుమెంటేషన్ లేకుండానే..
రుణాలు

- నిబంధనలకు విరుద్ధంగా మహిళ సంఘాలకు లోన్లు
- కనీస సీనియార్టీని గుర్తించని బ్యాంకులు
- లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పోటా పోటీగా రుణాలు
- మెప్మాలో నమోదు లేకుండానే డబ్బులు
- నేడు బ్యాంకర్లతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ ప్రత్యేక సమావేశం

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: రుణాలు కావాలనుకునే సామాన్యులను గడప కూడా తొక్కనివ్వరు బ్యాంకర్లు. ఇక వీధి వ్యాపారుల పరిస్థితి ససేసరి. కానీ ఆదే మహిళ సంఘాల సభ్యులు ఒక బ్యాంకు వద్దకు వెళ్లి రుణాలు అడిగితే కనీస నిబంధనలు, దస్త్రాలు చూడకుండానే రూ. లక్షల రుణాలను అందిస్తున్నారు. మహిళా సంఘాలు ఆదర్శంగా రుణాల తిరిగి చెల్లింపులు చేస్తాయి. కాగా 90శాతం రికవరీ రేటుతో రాష్ట్రంలోనే ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని మెప్మా మహిళా సంఘాలు ముందున్నాయి.

డాక్యుమెంటేషన్ లేకుండానే రుణాలు

మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలను అందించేందుకు నిధులు కేటాయిస్తారు. అయితే పది మంది సభ్యులతో ఒక సంఘంగా ఏర్పడిన తర్వాత సభ్యులు కొంత డబ్బుతో బ్యాంకులో పొదుపు ఖాతాను తెరవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో గ్రామదీపికలు, రిసోర్స్ పర్సన్‌లు పది మంది సభ్యులను గుర్తించి కమ్యూనిటీ ఆర్గనైజర్(సీవో)ద్వారా బ్యాంకుకు పరిచయం చేస్తారు. ఆలా సంఘం పనితీరు ఆధారంగా సభ్యులు పొదుపు చేసిన డబ్బులకు తగిన స్థాయిలో మాత్రమే కేటగిరిలో బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తారు. ఒక సంఘానికి రూ. 10 లక్షలు రుణాలు రావాలంటే కనీసంగా ఐదేళ్ల సీనియార్టీని పరిగణిస్తారు.

అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటును ఇవ్వటానికి బ్యాంకర్లకు భారీగా నిధులు కేటాయించారు. ఖమ్మం మెప్మా పరిధిలో 162 మంది ఆర్పీలు, 4,300 సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి సీనియారిటీ మేరకు రూ.5 లక్షల నుంచి రూ.20లక్షల పై వరకు రుణాలు అందిస్తున్నారు. ఐదు సంవత్సరాలు ఉన్న రూ.10లక్షలు పైన ఇవ్వటానికి అవకాశం ఉంటుంది. ఖమ్మం మెప్మా పరిధిదిలో తిరిగి చెల్లింపులు 90శాతానికి పైగా ఉన్నాయి దీంతో ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులు మహిళా స్వయం సంఘాలకు రుణాలను ఇవ్వటానికి ముందుకొస్తున్నాయి. ఇదే సందర్భాన్ని మెప్మాలోని కొంతమంది ఆర్పీలు దుర్వినియోగం చేస్తున్నారు. బ్యాంకర్లతో లోపాయికారిగా ఒప్పందాలు చేసుకుంటున్నారు. సంఘాల గుర్తింపుపై మెప్మా అనుమతి, ఆన్‌లైన్ నమోదును కూడా పాటించటం లేదు. సభ్యులు పైసా డబ్బులు పొదుపు చేయకుండానే రూ. లక్షల రుణాలను బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. బ్యాంకులు లక్ష్యాన్ని పూర్తి చేసుకునేందుకు ఆర్పీలు,ఆ పై స్థాయిలోని క్యాడర్ పరిశీలించకుండానే రుణాలను మంజూరు చేయటంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.1కోటి రుణాలను ఐదు సంఘాలకు అందించేందుకు సిద్ధమయ్యారు. బ్యాంకుల నుంచి సంఘా ల అధ్యక్షుల ఖాతాలకు డబ్బులు జమై తిరిగి వెళ్లటంతో స్కాం బయటకు వచ్చింది. దీంతో ఖమ్మం మెప్మాలో ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైంది.

నేడు బ్యాంకర్లతో కమిషనర్ ప్రత్యేక సమావేశం

ఖమ్మంలో చోటు చేసుకున్న సంఘటన రాష్ట్ర స్థాయి అధికారుల వరకు వెళ్లింది. సభ్యులు డబ్బులు పొదుపు చేయకుండానే, మెప్మాలో సంఘాలు నమోదు కాకుండానే రుణాలు ఇవ్వటం చర్చనీయాంశంగా మారింది. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, లీడ్ బ్యాంకు మెనేజరు, ఖమ్మంలోని అన్ని బ్యాంకుల మెనేజర్లు, మెప్మా అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

టన్ను గంజాయి దహనం

తల్లాడ/కొత్తగూడెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన రూ.4 కోట్ల విలువైన సీజ్ చేసిన 1065.13 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు దహనం చేశారు. శుక్రవారం ఖమ్మంజిల్లా ఐఎన్‌టీయూసీ కాంప్లెక్స్‌లోని ప్రభుత్వ అనుమతి పొందిన తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలోని ఏడబ్ల్యూఎం ప్లాంట్‌లో దహనం చేశారు. పాల్వంచ, అశ్వారావుపేట, మణుగూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 22 కేసుల్లో సీజ్ చేసిన గంజాయిని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్థన్‌రెడ్డి పర్యవేక్షణలో దహనం చేశారు. ఒడిసా, ఆంధ్రప్రదేశ్ ఏవోబీ నుంచి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గోవా, రాజస్థాన్‌తోపాటు పలు రాష్ట్రాలకు సరఫరా అవుతున్న గంజాయి ఖమ్మం-భద్రాచలం జాతీయ రహదారి మీదుగా తరలిస్తున్న క్రమంలో పాల్వంచ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 17కేసుల్లో 1036.43 కిలోలు, అశ్వారావుపేటలో ఒక కేసులో 2.8 కిలోలు, మణుగూరులో 4కేసుల్లో25.9కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఈ నెల 1న ఖమ్మంలో రూ.2.80 కోట్ల విలువ చేసే 1120కిలోల గంజాయి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ. 6. 80కోట్ల విలువ చేసే 2185కేజీల గంజాయిని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్యతోపాటు ఇతర సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


మహిళా ఉద్యోగులు పేర్చిన బతుకమ్మలను పరిశీలిస్తున్న సీఎండీ, అధికారులు

బతుకమ్మ వేడుకలు సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం

- సింగరేణి సీఎండీ బలరామ్

కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 4: తెలంగాణ ఆడపడుచుల అపురూపవేడుక, మన సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణంగా బతుకమ్మ నిలిస్తోందని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ అన్నారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం కార్పొరేట్ ఆవరణలో మూడవరోజు బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. కార్పొరేట్ మహిళా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో స్వయంగా పూలు సేకరించడం మొదలుకొని.. అందరికంటే ముందుగా చూపరులను ఆకట్టుకునే బతుకమ్మను పేర్చడంలో పోటీపడ్డారు. రంగురంగుల పూలు తీసుకొచ్చి మిగతా మహిళా ఉద్యోగులకంటే బిన్నంగా ఆకర్షణీయంగా ఉండేలా ముద్దపప్పు బతుకమ్మను పేర్చి, బొడ్డెమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రతిభతో పేర్చిన బతుకమ్మలలో పర్చేజ్ విభాగంకు ప్రథమ, సేఫ్టీ విభాగానికి ద్వితీయ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగానికి తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. కాంట్రాక్ట్ కార్మికుల విభాగంలో రూట్ కు ప్రథమ, లక్ష్మి కి ద్వితీయ, శారద తృతీయ విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపి విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. మహిళా ఉద్యోగులు, కార్మికులు బతుకమ్మ పూజలు నిర్వహించి, కార్పొరేట్ ఆవరణలో అమ్మవారి గుడి వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణ (ఈఅండ్ఎం, ఆపరేషన్స్), జి. వెంకటేశ్వర్‌రెడ్డి (పీఅండ్‌పీ, పా), కవితా నాయుడు జీఎం(పర్సనల్, ఐఆర్‌ఎండ్‌పీఎం), అధికారులు జి. హరిణి, జి. సునిత, ఎం. విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సీజ్ అయిందా.. నో టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

ఆసుపత్రులు నిబంధనలు పాటించకుండా ల్యాబ్‌లు, ఆసుపత్రుల నిర్వాహణ సాగించారనడానికి, వాటికి జిల్లా అధికారులు వంతుపాడారనడానికి ఇటీవల రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ బృందం ఖమ్మంలో తనిఖీలు నిర్వహించిన 10 ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్లలో తొమ్మిది సెంటర్లకు నోటీసులు జారీ చేయడమే నిదర్శనం.

ఒక్కో ఫైలుకు ఒక్కో రేటు...

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గత డీఎంహెచ్‌వోను సరెండర్ చేయడానికి ముందువరకు ఆ శాఖలో ఏ ఫైలు కదలాలన్నా ఓ రేటు నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడేవారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా అన్నీ నిబంధనల పాటించి కొత్తగా ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతులకు దరఖాస్తు చేసుకుంటే రూ. 2 లక్షలు చెల్లింపులు చేస్తేనే వాటికి క్లియరెన్స్ ఇచ్చేవారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి నిబంధనలు సరిగ్గా లేనిపక్షంలో దానికి రెండింతల నగదు చెల్లించుకునే వరకు ఫైలు కదలని పరిస్తితులు ఉండేవన్న వాదన వినిపిస్తోంది. ఇక రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రూ. 25 నుంచి రూ. 30 వేలు, డెంటల్ ఆసుపత్రులకు రూ. 20 వేల వరకు వసూలు చేసిన అనంతరం మాత్రమే ఆయా ఆసుపత్రుల లైసెన్సులు రెన్యువల్ చేసేవారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఇవన్నీ పక్కనపెడితే సీజ్ చేసిన, క్రిమినల్ కేసులున్న వాటికి అనుమతులు ఇవ్వాలంటే కొత్తగా ఆసుపత్రి ఏర్పాటు చేసుకున్నదానికి సమర్పించే అమామ్యాలకు మూడింతలు అదనంగా చెల్లిస్తే తప్ప అధికారుల దగ్గర ఫైలు కదిలే పరిస్థితి ఉండేది కాదన్న వాదన లేకపోలేదు. అలా మామూళ్లు తీసుకున్న తర్వాత తూతూమంత్రంగా విజిట్ చేసి అనుమతులు ఇచ్చేవారన్న విమర్శలున్నాయి. ఇక షోకాజ్ నోటీసులు మాటున పెద్ద ఎత్తున నోట్ల వ్యవహారం సాగించారన్న ఆరోపణలున్నాయి. ముందుగా సమాధానం కోసం నోటీసులు జారీ చేసి ఆపై నోట్లరూపంలో దండుకునేవారన్న ప్రచారం జరుగుతోంది.

నేటితో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు తెర

- ఖమ్మం జిల్లాలో 1075 మందికి, భద్రాద్రి జిల్లాలో 852 మందికి పూర్తి

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 4: డీఎస్సీ ఉద్యోగాలకు 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారంతో పూర్తికానుంది. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్న విషయం విధితమే. శుక్రవారం నాటికి మొత్తం 1075 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేశామని, మిగిలిన 367మంది సర్టిఫికెట్లు శనివారంతో పూర్తి చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. ఇప్పటివరకు స్కూల్ అసిస్టెంట్స్ 372, ఎస్‌జీటీలు 644, ఎల్‌పీ 40, పీఈటీ 19మందికి వెరిఫికేషన్ పూర్తిచేసినట్లు తెలిపారు. మిగిలిన ఎస్‌ఏ 136, ఎస్‌జీటీ 211, ఎల్‌పీ 9, పీఈటీ 11మందికి శనివారంతో పూర్తికానున్నట్లు తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో...

కొత్తగూడెం అర్బన్: భద్రాద్రి జిల్లాలో 447 టీచర్ పోస్టులకు 1015మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారం వరకు 852మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినట్టు డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. మిగిలిన 163మంది అభ్యర్థులు శనివారం సాయంత్రం 5గంటల్లోపు తప్పని సరిగా హాజరుకావాలన్నారు. హాజరైన అభ్యర్థుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కాగా, గుండాల మండలానికి చెందిన ఈసం విజయనిర్మల డెంగ్యూ జ్వరంతో నడవలేని స్థితిలో వెరిఫికేషన్‌కు రాగా, ఆమె పరిస్థితిని గమనించిన ఎంఈవో ఎం.ప్రభుదయాళ్ ప్రత్యేక సదుపాయాలు కల్పించి వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఎంఈవో చొరవను డీఈవో అభినందించారు.

శిక్షణకు వెళ్లిన
భద్రాచలం ఏఎస్పీ

- ఇన్‌చార్జ్ ఏఎస్పీగా రవీందర్ రెడ్డి

భద్రాచలం, అక్టోబరకు 3: భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ శాంక్వర్ 45 రోజుల శిక్షణ కోసం శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇటీవల భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన శిక్షణ నిమిత్తం వెళ్లడంతో ఆయన స్థానంలో మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి ఇన్‌చార్జ్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

15న భద్రాది దేవస్థానం
దాతల సత్కార సభ

భద్రాచలం, అక్టోబరు 3: భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సత్కార సభను ఈ నెల 15న నిర్వహించనున్నారు. భద్రాద్రి దేవస్థానం కు నగదు, వస్తురూపణ విరాళాలు అందజేసిన దాతలకు తానీషా కళ్యాణమండపం వెనక గల మారుతి సదనంలో ఈ సభను నిర్వహించనున్నారు. రూ లక్ష ఆపైన విరాళాలు అందజేసిన దాతలకు ఈ సత్కారాన్ని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే సంబంధిత దాతలకు సమాచారాన్ని పంపినట్లు తెలుస్తోంది. దాతల సత్కార కార్యక్రమానికి గత ఏడాది భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రెండో ఏడాది సైతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేవస్థానంలోని ఉద్యోగులకు బాధ్యతలను అప్పగించి కార్యక్రమానికి వచ్చే దాతలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు.

నేడు జిల్లాలో పర్యటించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మంనగరంలోని విద్యానగర్ కాలనీతో పాటుగా రఘునాథపాలెం మండలంలో విస్త్రతంగా పర్యటించనున్నారు. జీకే బంజర,వీఆర్ బంజర, పాపటపల్లి, కొటపాడు, చిమ్మపూడిలో అభివృద్ది పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపనలు, ప్రారంబోత్సవాలు చేస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

బాలా త్రిపురసుందరిగా..

ఎర్రుపాలెం, అక్టోబరు4: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండోరోజు శుక్రవారం బాలాత్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఎర్రుపాలెం గ్రామానికి చెందిన చీదెళ్ల వెంకటరామన్ దంపతులు పద్మావతి అమ్మవారికి సుమారు రూ.4లక్షల విలువగల ముత్యాల కవచం తయారు చేయించి అలయానికి బహూకరించారు.

అందుబాటులో 'తెలంగాణ చరిత్ర'

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబర్ 4: తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం పుస్తకాన్ని ప్రణాళిక శాఖ విడుదల చేసిందని సీపీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ పుస్తకంలో తెలంగాణ చరిత్ర, సామాజిక అంశాలతో పాటు ఆర్థిక పరిస్థితులు వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. గ్రూప్ 1, గ్రూపు 2 ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులకు, ఉద్యోగులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రూ 150లకు అందుబాటులో ఉన్నాయని కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో వీటిని పొందవచ్చని సీపీవో శ్రీనివాస్ తెలిపారు.


సర్వేను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ సురేంద్రమోహన్

సర్వే వివరాల ఆధారంగానే డిజిటల్ కార్డులు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్
- భద్రాచలంలో సర్వే తీరు పరిశీలన

భద్రాచలం, అక్టోబరు 4: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే తీరును భద్రాచలంలో రాష్ట్ర గనులశాఖ కార్యదర్శి ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ పరిశీలించారు. శాంతినగర్, కొత్తపేట ప్రాంతాల్లో డిజిటల్ సర్వే ఇప్పటికే ప్రారంభం కాగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సురేంద్రమోహన్ సర్వే తీరును పరిశీలించారు. ఇదే సమయంలో సిబ్బందికి పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో సురేంద్రమోహన్ మాట్లాడుతూ సర్వే బృందానికి పూర్తి పారదర్శకంగా వివరాలను అందజేయాలన్నారు. ఈ సర్వేలో తెలిపిన అంశాల ఆధారంగా డిజిటల్ కార్డు రూపకల్పన జరుగుతుందని రాబోయే కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలతో పాటు రేషన్, ఆరోగ్యం, ఇతర స్వయం ఉపాధి పథకాల మంజూరీ సమయంలో ఈ డిజిటల్ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

డిజిటల్ కార్డు రూపకల్పన సర్వే పరిశీలన అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో భద్రాచలం గోదావరి వారధి వద్ద చెక్‌పోస్టును జిల్లా ఇన్‌చార్జి సురేంద్ర మోహన్ తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించారు. భద్రాద్రి సరిహద్దున ఏపీలోని గ్రామాలుండటంతో అక్కడ నుంచి, భద్రాద్రి డివిజన్ నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చేపట్టాల్సిన చర్యలు, నిఘాను ఏ విధంగా పటిష్ఠవంతం చేయాలి అనే అంశాలపై మైనింగ్ ఎ.డి. దినేష్‌కుమార్‌తో కలిసి చర్చించారు.

పటిష్ఠమైన నిఘాను ఏర్పాటు చేయడం ద్వారా ఇసుక అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో చెక్‌పెట్టవచ్చని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట భద్రాచలం ఆర్డీవో కె.దామోదర్‌రావు, తహసీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి గుర్తింపు నెంబరు

రఘునాథపాలెం, అక్టోబరు 4: పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జరుగుతున్న డిజిటల్ సర్వేలో ప్రతి వ్యక్తికి గుర్తింపు నెంబర్ ఇవ్వటం జరుగుతుందని, ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలను వెర్వేరుగా నమోదు చేయాలని ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి, పూర్వ సంయుక్త కలెక్టర్ సురేంద్రమోహన్ డిజిటల్ సర్వే బృందాలకు సూచించారు. డిజిటల్ సర్వే తీరును శుక్రవారం రఘునాథపాలెం మండలం రాములుతండాలో పరిశీలించారు. ధరఖాస్తులో వ్యక్తుల నమోదు నుంచి ఆన్‌లైన్‌లో తప్పులు సవరణ, తొలగింపులు, చేర్పులపై సర్వే బృందాలకు సూచనలు చేశారు. సమగ్రంగా సర్వేను పూర్తి జరపాలని సూచించారు. ఎంపీడీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కిష్టారంవాసులకు అండగా ఉంటాం...

సత్తుపల్లి, సెప్టెంబర్ 4: సింగరేణి ఓసీ గనుల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, ప్రాంతాల్లోని రాబోయే తరాలను కాపాడుకునే బాధ్యత మనపై ఉందని, ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి చేయగలిగే ప్రతిపని పూర్తి చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో సింగరేణి బాంబ్ బ్లాస్టింగుల కారణంగా ఇటీవల నేలకూలిన ఇళ్లు, దెబ్బతిన్న ఇళ్లు, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి శుక్రవారం పర్యటించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించగా గ్రామానికి ఆనుకుని ఉన్న సైలోబంకర్‌ను సందర్శించి సింగరేణి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో సింగరేణి భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.


వెంగళరావు నగర్‌లో ప్రజల వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

సింగరేణి ఓసీల ప్రభావం నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. సైలో బంకర్ నుంచి వచ్చే కాలుష్యాన్ని అరికట్టేందుకు సింగరేణి అధికారులతో మాట్లాడతానని, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రణాళికలు రూపొందించాల్సి ఉందన్నారు. బ్లాస్టింగుల కారణంగా దెబ్బతిని శిథిలావస్థలో ఉన్నవాటిని మళ్లీ అక్కడే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సింగరేణి జీఎం వద్ద ఇప్పటికే ఇళ్ల నిర్మాణం కోసం నిధులు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన నిధులను విడుదల చేయించి ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూస్తామన్నారు. మౌలిక వసతుల కల్పన, పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అసెంబ్లీలో ప్రస్తావించాను: ఎమ్మెల్యే రాగమయి

సింగరేణి కారణంగా కిష్టారంతో పాటు సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావునగర్, ఎన్టీఆర్ నగర్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో తాను ప్రస్తావించానని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ప్రత్యేక సర్వే నిర్వహించి ఇళ్ల విషయంలో అందరికీ న్యాయం చేయాలని, సైలోబంకర్ కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్టా దయానంద్‌తో కలసి స్థానిక వెంగళరావు నగర్‌లో దెబ్బతిన్న ఇళ్ల యజమానులతో మాట్లాడి న్యాయం చేయాల్సిందిగా కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజును కోరారు. అదేవిధంగా నీలాద్రి అర్బన్ పార్క్‌లో అంతర్భాగంగా ఉన్న ముస్లింల ఖబరస్తాన్‌ను సందర్శించి ముస్లిం నాయకులతో కలసి వారి సమస్యను కలెక్టర్‌కు వివరిస్తానని చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు

నవంబరు 6 గడువు



- అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు కొత్తగా పేరు నమోదు చేసుకోవాల్సిందే
- వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా
- ప్రకటన విడుదల చేసిన అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 4: నవంబరు 6వ తేదీలోపు వరంగల్-ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం అక్టోబరు 16, 25 తేదీలలో మొదటి, రెండో రిపబ్లికేషన్ నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు నవంబరు 6 లోపు ఫారం 19ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నవంబరు 23న ముసాయిదా జాబితా

నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్టు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ తెలిపారు. డిసెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి, డిసెంబరు 25లోపు వాటిని పరిష్కరించి డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల జాబితాలను ఎన్నికలముందు ప్రతీసారి కొత్తగా తయారు చేస్తామని, గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా ఫారం 19ప్రకారం నూతనంగా దరఖాస్తును నవంబరు 6లోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 2024 నవంబరు 1కి ముందు ఆరేళ్లలో కనీసం మూడేళ్లపాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యాబోధనలో నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు ఓటరుగా నమోదుకు అర్హులని, వారు సంబంధిత విద్యాసంస్థ నుంచి ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు.

అర్హులైన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను, సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ ఫారం 19 ప్రకారం తహసిల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో లేదా స్వయంగా అందజేయాలన్నారు. సీఈవో తెలంగాణ.ఎన్ఐసీ.ఇన్ (ceotelangana.nic.in) అనే వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నవంబరు 6లోపు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో భక్తుల సందడి

కొనసాగుతున్న శరన్నవరాత్రులు, బతుకమ్మ ఉత్సవాలు



ఖమ్మంలో...

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 4: నగరంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు, బతుకమ్మ ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి. రెండు కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొంటుండటంతో జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. దేవీనవరాత్రుల్లో రెండో రోజున అమ్మవారికి పలుచోట్ల వివిధ అలంకారాలు నిర్వహించగా.. బతుకమ్మ ఉత్సవం మూడో రోజున మహిళలు బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించారు. రెండు కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతున్నారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించే దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అమ్మవారికి ధాన్యలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. పర్ణశాల రామాలయంలో దేవీ నవరాత్రులతోపాటు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజతోపాటు సాయంత్రం బతుకమ్మ ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈవో రమాదేవి

రామనామ నాదంతో

మారుమోగనున్న భద్రాద్రి

పట్టణంలో మైకు వ్యవస్థను ప్రారంభించిన ఈవో రమాదేవి

భద్రాచలం, అక్టోబరు 4: రామనామ నాదంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం మారుమోగనుంది. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిత్యం జరిగే పూజా కార్యక్రమాలు, రామనాదాలు పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో భక్తులకు, పట్టణవాసులకు వినిపించేలా దేవస్థానం అధికారులు మైకు వ్యవస్థను రూపొందించారు. ఈ మైకు వ్యవస్థను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి శుక్రవారం రామాలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ముందుగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొని పూజలు నిర్వహించారు. భద్రాచలం పట్టణంలో భక్తులకు స్వామి వారి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వినపడాలనే సంకల్పంతో దాత సుమారు రూ.4 లక్షలు అందజేయగా.. దానితో భద్రాచలం పట్టణంలో మైకుల వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో భద్రాచలం రామాలయం నుంచి బ్రిడ్జి రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, ఇతర ప్రధాన కూడళ్లలో స్వామివారి కార్యక్రమాలు భక్తులకు నిత్యం మైకు ద్వారా వినపడే వెసులుబాటు లభించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగు విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, కోటేష్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక



పరుగు పోటీలో తలపడుతున్న బాలికలు

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు4: త్వరలో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ జట్లను శుక్రవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లావ్యాప్తంగా సుమారు 80మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికల్లో భాగంగా అండర్-14, 16, 18, 20 బాలురు, బాలికల విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ప్రకటించారు. జట్టులోవిఘ్నేష్, చరణ్‌గౌడ్, అనిల్‌కుమార్, విజయరామఅరవింద్, కీర్తి, మంజుని, దీక్ష, హస్మిత, వైశాలి, మనుశ్రీ, రూప, కృష్ణవేణి, లోకేష్, ముబీన్, సాయి, బిందు, వెన్నెల, ఆఫ్రీన్, వీరేందర్, అనిల్, అక్షర్, షారూఖ్, వివేక్‌చంద్ర, మనీషా, సింధుప్రియ, నవ్య, అనూషలు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఎంపికలను కోచ్ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు సమీక్షించారు.

పర్ణశాల రామాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

దుమ్ముగూడెం అక్టోబరు 4 : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ పర్ణశాల రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకారం, విశేష పూజలు, కుంకుమార్చనలను శాస్త్రోక్తంగా జరిపించారు. ముఖ్య అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, నరసింహాచార్యులు, రంగమ్ వెంకటాచార్యులు, ఆలయ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రసేన్ మహరాజ్ చిరస్మరణీయులు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ఎమ్మెల్యే కూనంనేనిని సన్మానిస్తున్న అగర్వాల్ సేవా సంఘం సభ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 4: అగ్రసేన్ మహరాజ్ ప్రజల అభివృద్ధికి చేపట్టిన సంస్కరణలు, సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం కొనియాడారు. కొత్తగూడెం అగర్వాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అగ్రసేన్ మహరాజ్ 5,148జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నేతాజీ మార్కెట్లోని హనుమాన్ టెంపుల్ వద్ద నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా క్షత్రియ వంశంలో జన్మించిన అగ్రసేన్ మహరాజ్ తన రాజ్యాభివృద్ధి కోసం, ప్రజలకోసం వైశ్యుడిగా మారి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటునందించారని గుర్తుచేశారు. వ్యాపార లావాదేవీలు సజావుగా సాగితేనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని భావించి వ్యాపారులను నిరంతరం ప్రోత్సహించేవారన్నారు. ఐదు వేల సంవత్సరాల కింద సంపన్నుడిగా జన్మించిన అగ్రసేన్ మహరాజ్ పేదల అభ్యున్నతికోసం ప్రతి పేదవాడిని సంపన్నులుగా చేయాలని పరితపించేవారని పేర్కొన్నారు. ఒక రోజు ఓ రూపాయి, ఓ ఇటుక ఇస్తే వారు కొద్దిరోజుల్లోనే సొంత ఇంటిని కట్టుకోవడంతో ఆర్థికంగా స్థిరపడతారని పథకాన్ని అమలు చేసి విజయం సాధించారని అన్నారు. ఢిల్లీలో మహరాజ్ అగ్రసేన్ స్మారక వైద్యశాల నిర్మించారని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తే నవ సమాజనిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా, సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు భజరంగ కుమార్ అగర్వాల్, సెక్రటరీ బ్రిడ్జిల్లాల్ అగర్వాల్, ట్రెజరర్ రాజేంద్రప్రసాద్ అగర్వాల్, సభ్యులు మహేష్, సుభాష్, చంగామల్, శ్యామ్, ముఖేష్‌అగర్వాల్, లక్ష్మణ్, అశోక్‌రాణి, పత్తు సత్యనారాయణ, అనుప్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

కొణిజర్ల, అక్టోబరు 4: టీడీపీ సీనియర్ నాయకుడు మండలంలోని పెద్దమునగాల గ్రామానికి చెందిన చింతల మల్లయ్య(70) గుండెపోటుతో మరణించారు. మల్లయ్య ఈ ప్రాంతంలో పార్టీ నిర్మాణం కోసం ఎనలేని కృషి చేశారు. మల్లయ్య మరణవార్త తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు తాతా సుధాకర్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. ఎంతమంది పార్టీలు మారిన మల్లయ్య మాత్రం టీడీపీ నుంచి వీడలేదని నాయకులు కొనియాడారు. మండలంలో పార్టీ అభివృద్ధిలో కూడా మల్లయ్య సేవలు చిరస్మరణీయం అన్నారు. నివాళులు అర్పించిన వారిలో చింతల మురళి, దామా శ్రీనివాసరావు, ఓర్సు ఆంజనేయులు, బండారుపల్లి భాస్కర్‌రావు, చింతనిప్పు సత్యం, పాపిరెడ్డి, లాలయ్య, నరసింహరావు, సత్యం, నగేష్, ముత్తయ్య, గోవర్ధన్, వెంకటయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మా పేరుతో రుణాలు లేకుండా చూడండి..

- అసిస్టెంట్ కమిషనర్‌కు మహిళల వినతి



అసిస్టెంట్ కమిషనర్‌కు వివరిస్తున్న బాధితులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: 'మేము ప్రతి రోజు కూలీ పనులు చేసుకొని బతికేవాళ్లం, రెక్కాడితే కాని డొక్కడని కుటుంబాలు మావీ.. మా పేరుతో ఎటువంటి డ్వాక్రా రుణాలు లేకుండా చూడండి.. మా పత్రాలు మాకు ఇప్పించండి..' అని ఖమ్మం నగరంలోని 33వ డివిజన్, ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలు అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా అధికారులకు తెలియకుండా 33వ డివిజన్ ఆర్పీ ఐదు సంఘాలను ఏర్పాటు చేసి ప్రైవేట్ బ్యాంకు నుంచి రూ.కోటి రుణాలకు యత్నించిన విషయం పాఠకులకు విధితమే. కాగా రుణాల పేరుతో మోసానికి గురైన మహిళలు గత మూడు రోజులుగా గాంధీ చౌక్‌లోని ప్రైవేట్ బ్యాంకు చుట్టూ తిరుగుతూ తమకు ఎలాంటి రుణాలు ఇవ్వలేదని నో డ్యూ సర్టిఫికేట్ ఇవ్వాలని కోరారు. తమ వద్ద నుంచి తీసుకున్న 15 ఫొటోలు, ఆధార్, రేషన్, పాన్ కార్డులు, ఇతర పత్రాలను తిరిగి ఇవ్వాలని కేఎంసీ అధికారులను ఆశ్రయించారు. దీంతో స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ టీఎంసీ సుజాతను పిలిపించి మహిళలతో మాట్లాడించారు. బ్యాంకర్లతో మాట్లాడి నో డ్యూ సర్టిఫికేట్‌తో పాటుగా దరఖాస్తు పత్రాలను తిరిగి ఇప్పించాలని ఆదేశించారు. మోసం చేసిన ఆర్పీ ఇప్పటికే బెదిరిస్తున్నారని కొన్ని ఫోన్ కాల్ రికార్డులను మెప్మా అధికారులకు వినిపించారు.

బిల్ కలెక్టర్‌పై విచారణకు ఆదేశం

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు, ట్యాక్స్‌లను క్షేత్రస్థాయిలో నిర్ణయించాల్సిన బిల్ కలెక్టర్ పక్క డివిజన్‌లో ప్రత్యేక సర్వే పనులకు వెళ్లి రూ.12వేలు డిమాండ్ చేసి అవినీతి ఊబిలో చిక్కుకున్నారు. పక్కా ఆధారాలతో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆ బిల్ కలెక్టర్‌ను తక్షణమే సస్పెన్షన్ వేటు వేశారు. అయితే ఇదే బిల్ కలెక్టర్ గతంలో కూడా కేఎంసీలో పలు విభాగాల్లో పలు కేటగిరి ఉద్యోగాలు చేశారు. ఈ క్రమంలోనే కేఎంసీ పాలకవర్గం అమోదం లేకుండా 68 మంది గార్డెన్ కార్మికుల నియామకంలో అవినీతి హస్తం ఉందని విమర్శలు వెలువడుతున్నాయి. కేఎంసీ గత ప్రజాప్రతినిధి సీసీగా పనిచేసిన కాలంలోను పలు ఆరోపణలు వెలువడ్డాయి. దీంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని రెండు వారాల్లో నివేదికలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ అధికారిణికి కమిషనర్ ఈనెల 29న ఆదేశాలిచ్చారు. అయితే ఆదేశాలు తీసుకున్న అధికారి శిక్షణకు హైదరాబాద్ వెళ్లారు. మరో వారం రోజుల వరకు విచారణకు గడువు ఉంది. ఈ విచారణ అంశం ఖమ్మం నగర పాలక సంస్థలో చర్చనీయాంశంగా మారింది.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి

భద్రాచలం, అక్టోబరు 4: భద్రాచలంలోని ఓ లాడ్జిని నిర్వహిస్తున్న మణికంఠ అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా చితకబాదారు. కోదండ రామాలయం సమీపంలో ఓ లాడ్జిని లీజుకు తీసుకొని నిర్వహిస్తుండగా గతంలో అందులో ఒక గదిని అద్దెకు తీసుకున్న వ్యక్తి చెల్లించాల్సిన రూ2,500 అద్దె ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ నగదును ఇవ్వాలని ఆ వ్యక్తికి మణికంఠ ఫోను చేసి అడుగుతుండటంతో డబ్బులిస్తానని నమ్మబలికి గురువారం అర్ధరాత్రి దాడి చేసి విచక్షణారితంగా కొట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దాడి చేస్తున్న వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా వారు మణికంఠపై తీవ్రంగా దాడి చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. తీవ్రంగా గాయపడ్డ మణికంఠను ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. కాగా అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భద్రాచలం సీఐ సంజీవరావు తెలిపారు.

నరేశ్ రెడ్డి మృతికి మంత్రుల సంతాపం



ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఖమ్మం పార్లమెంట్ గత ఎన్నికల ఇన్‌చార్జ్ నూకల నరేశ్ రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మంచి అనుచరుడుగా నూకల ఉండేవారు. కాంగ్రెస్ కార్యకర్తలతో ఎప్పుడు కలిసి మెలిసి అందుబాటులో ఉంటారని పేరుంది. కాగా నూకల నరేశ్‌రెడ్డి ఆకాల మరణానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సంతాపం ప్రకటించారు.

రెండు చోట్ల చైన్ స్నాచింగ్



ఖమ్మం క్రైం అక్టోబరు 4: ఖమ్మం నగరంలో శుక్రవారం రాత్రి రెండుచోట్ల చైన్‌స్నాచింగ్ జరిగింది. నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో ఓ మహిళ బస్టాండ్‌లో దిగా తన ఇంటికి నడుచుకుంటూ వెళుతూ ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి నడుచుకుంటూ వెళుతున్నా మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని వెళ్లాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో అప్పటికే దుండగుడు ద్విచక్ర వాహనంపై పారిపోయాడు.

వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజమండ్రికి చెందిన ఓ మహిళ ఖమ్మంలో నివాసముంటున్న తన కూతురు వద్దకు వచ్చింది. జమ్మిబండ పార్కు సమీపంలో కారు దిగి రోడ్డు దాటేందుకు నడుచుకుంటూ వెళ్తూ ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. దీంతో వారు రెండవ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు సంఘటన స్థలాల వద్దకు చేరుకొని వివరాలు సేకరించి సమీప ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రసాయన వ్యర్థాల అడ్డగింత

- లారీని పోలీసులకు అప్పగించిన స్థానికులు



మున్నేరులో రసాయనాలు వదిలేందుకు వచ్చిన ట్యాంకర్

ఖమ్మం రూరల్, అక్టోబరు 4: హైదరాబాద్‌లోని వివిధ రసాయన పరిశ్రమల నుంచి సేకరించిన వ్యర్థాలను లారీ ట్యాంకర్‌లో నింపుకొని తీసుకొచ్చి మున్నేరులో పోస్తుండగా స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని వెంకటగిరి పంచాయతీ పరిదిలోని మున్నేరులో రసాయన వ్యర్థాలను పోసేందుకు ఓ ట్యాంకర్ రాగా దాన్ని స్థానికులు వెంబడించి వ్యర్థాలను మున్నేరులో పోయడానికి వీలులేదని అడ్డుకున్నారు. రసాయన వ్యర్థాలను మున్నేరులో పోయడం వల్ల ఆ నీటిని తాగిన పశువులు, జీవాలు అనారోగ్యం పాలు అవుతున్నాయని, చేపలు కూడా చనిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కలుషిత నీరు వల్ల పంటలకు కూడా హాని కలుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ట్యాంకర్లను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వారు వెంటనే వదిలివేశారని, మళ్లీ అవే ట్యాంకర్లు రసాయన వ్యర్థాలతో వస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రసాయన వ్యర్థాలు విషపూరితమైనవి కాబట్టే హైదరాబాద్ నుంచి ఇక్కడ వరకు తీసుకోస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్యాంకర్‌ను కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లాలని గతంలో ఓ సారి ట్యాంకర్‌ను పోలీసులకు అప్పగిస్తే వెంటనే వదిలేశారని వారు ఆగ్రహించారు. ట్యాంకర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ కృష్ణ వివిధ రసాయన పరిశ్రమల నుంచి సేకరించిన వ్యర్థాలను ట్యాంకర్‌లో నింపుకుని మండలంలోని వెంకటగిరి సమీపంలోని మున్నేరులో పోసేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. స్థానికుల ఫిర్యాదుమేరకు లారీ డ్రైవర్ కృష్ణ లారీ యజమాని మధుసూదన్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి




దుమ్ముగూడెం, అక్టోబరు 4: జిన్నెలగూడెం గ్రామశివారున కోడిపందేల స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. పోలీసుల రాకను చూసి కోడి పందేల జూదం ఆడుతున్న కొంతమంది వ్యక్తులు సంఘటనా స్థలం నుంచి పరారయ్యారు. వెంబడించిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.4500ల నగదు, రెండు కోడి పుంజులు, ఐదు కోడి కత్తులతోపాటు రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా, హెచ్‌సీ రాంబాబు కేసు నమోదు చేశారు.

దాడి చేశారని ఫిర్యాదు

కొణిజర్ల, అక్టోబరు 4: దాడి చేసి గాయపరిచారని పేర్కొంటూ మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన ఓ వ్యాపారి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసిన చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. ఫిర్యాదులో ఉన్న వివరాల ప్రకారం రామకృష్ణ, ఉదయలక్ష్మి దంపతులు మెయిన్‌రోడ్డు పక్కన స్వీట్, కొబ్బరిబొండల వ్యాపారం చేస్తున్నారు. వీరి దుకాణం పక్కన ఓ మహిళ పూల వ్యాపారం చేస్తున్నది. ఈ క్రమంలో మహిళకు ఫిర్యాదుదారులకు ఘర్షణ జరిగింది. దాంతో పూలవ్యాపారం చేస్తున్న మహిళ గ్రామంలోని ఓ మాజీ ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేసుకుంది. దాంతో మాజీప్రజాప్రతినిధి వచ్చి తమతో గొడవ పడి దాడి చేయబోగా తన భార్య అయిన ఉదయలక్ష్మి చేతికి బలమైన గాయమైందని, వారి వలన తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని రామకృష్ణ, భార్య ఉదయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి



రేపు ధ్వజస్తంభ ఆవిష్కరణ

ఖమ్మం కల్చరల్, అక్టోబరు 4: ఖమ్మం నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్ బైపాస్‌రోడ్ లో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మ శాస్త్ర(అయ్యప్పస్వామి) దేవాలయంలో ఆదివారం ఉదయం 7గంటల 12 నిమిషములకు ధ్వజస్తభం నిలబెట్టుతున్నట్టు అధ్యక్షుడు మేకల హనుమంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మశ్రీ పాకలిల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో తంత్రి బ్రహ్మశ్రీ తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రిచే కేరళ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 9గంటల 20 నిమిషములకు అయ్యప్ప స్వామి వారి పంచలోహ విగ్రహం పోతపోయనున్నట్లు తెలిపారు. స్వామి వారి విగ్రహం పోతపోయు సమయంలో అవకాశం ఉన్న భక్తులందరూ పంచలోహ విగ్రహంలో వెండి, బంగారం తదితర లోహములను భక్తులు వారి వారి స్వహస్తములతో వేయవచ్చని తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.

కొనసాగుతున్న బతుకమ్మ, శరన్నవరాత్రులు


ఖమ్మంలోని ఫైవ్ ఎలిమెంట్ అపార్ట్‌మెంట్‌లో


మధిర సుందరయ్య నగర్‌లో..


జిల్లా కోర్టులో బతుకమ్మ సంబురాలు

కొణిజర్ల: ప్రతి రోజు బతుకమ్మ వేడుకల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలు బతుకమ్మలతో ఆటపాటలతో సంబరాలను జరుపుతున్నారు. ప్రతి గ్రామంలో సంబరాలు మిన్నంటుతున్నాయి.

దేవీనవరాత్రుల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండల వ్యాపితంగా దేవీనవరాత్రులు భక్తులు, కమిటి సభ్యులు ఉత్సాహంగా జరుపుతున్నారు. కమిటి సభ్యులు మాలదరించి పూజలో పాల్గొన్నారు.

●మధిరటౌన్: మధిర పట్టణంలో పలు దుర్గాదేవి మండపాల తో పాటు పలు వీదుల్లో మహిళలు బతుకమ్మల వద్ద ఆటపాటలతో సందడి చేసారు. శుక్రవారం మధిర లోని లడక బజార్ లో దేశబక్త యువజన సంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారిని ధనలక్ష్మీ అలంకారం తో అలంకరించారు.

●తిరుమలాయపాలెం: బతుకమ్మ పండుగ వేడుకలను శుక్రవారం మండలలోని ఆయా గ్రామాల్లోని నిర్వహించారు. ఈసందర్బంగా సుబ్లేడు, కాకరవాయి, బచ్చోడు, పిండిప్రోలు, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలు డాక్టర్ వసుంధర ,సిబ్బంది వివిధ పూలలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకెళ్లి చెరువల్లో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం ఉమారాణి, పాల్గొన్నారు.

●కారేపల్లి: మండల పరిదిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో దేవిశరన్నవరాత్రులలో బాగంగా శక్రవారం గ్రామస్తులు ఘనంగా పూజాలు చేశారు. పూజారి నాగసాయి శర్మ ఆధ్వర్యంలో గాయత్రిమాతగా భక్తులకు దర్శనం ఇచ్చిన దుర్గామాతకు పూజాలునిర్వహించారు.


కొణిజర్లలో గాయత్రీదేవిగా అమ్మవారు..

యుద్ధప్రాతిపదికన షాదీఖానా పనులు

» పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్


షాదీఖానా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కల్లూరు, అక్టోబరు 4: నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిన షాదీఖానా పనులను యుద్ధప్రాతి పదికపై పూర్తి చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కల్లూరులో శుక్రవారం నిధుల కొరతతో నిలిచిన షాదీఖాన ప్రాంగణాన్ని కలెక్టర్‌తో పాటుగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించి పరిశీలించారు. పాదీఖానా పనులు అగిపోయిన విషయమై, అటవీశాఖతో ఉన్న స్థల వివాదంపై, పీఆర్, రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలసుకున్నారు. షాదీఖాన ప్రాంగణం ముందు ఖాళీగా ఉన్న స్థలాన్ని ముస్లీంల అవసరాలకు కేటాయించేలా పరిశీలించి ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలాన్ని కేటాయించాలని ఆయన ఆర్డీఓ రాజేందర్‌గౌడ్‌ను ఆదేశించారు. జామే మసిద్‌లో ఏర్పాటైన సమావేశంలో కలెక్టర్ ప్రసంగిస్తూ రెండు, మూడు నెలల్లో షాదీఖానా నిర్మాణం పనులు పూర్తి చేయిస్తామన్నారు. ప్రాంగణం ముందు ఖాళీగా ఉన్న భూమి విషయంలో సర్వే చేయించి పరిష్కారిస్తామని చెప్పారు. షాదీఖానా, కబరస్థాన్‌లకు మౌలిక వసతుల కల్పనతో పాటుగా వాటి నిర్వహణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సందర్శించి వాటిలో కల్పించిన వసతులను గమనించి పిల్లలను ప్రవేట్ బడులకు పంపకుండ ప్రభుత్వ బడులకు పంపాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే రాగమయి ప్రసంగిస్తూ పాదీఖానా నిర్మాణ పనుల స్థల సమస్యను కలెక్టర్ పరిశీలించి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసినందుకు కృతజ్ఞతులు తెలిపారు. పాదీఖానాను ఆధునీకంగా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, ముస్లిం మడల కమిటి అధ్యక్షుడు సయ్యద్ ఆలీ మసీద్ సదరు ఎండి హనీఫ్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, యాఖుబ్‌అలీ, ఎస్‌కే ఉస్మాన్, తురాబలి, మాజీ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, తహసిల్దార్ సాంబశివుడు, పాల్గొన్నారు.

ఖాతాదారుల నమ్మకమే భద్రాద్రి బ్యాంకు ఘనకీర్తి

» బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి

ఖమ్మం గాంధీచౌక్, అక్టోబరు 4: భద్రాద్రి బ్యాంకు 28వ వార్షికోత్సవం ఖమ్మం గాంధీ చౌక్‌లోని కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ 28 సంవత్సరాలుగా నమ్మకమే ప్రమాణంగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రథమ శ్రేణి బ్యాంకుగా రిజర్వు బ్యాంకుచే గుర్తింపు కూడా పొందిందని అన్నారు. 17 బ్రాంచ్‌లతో 950 కోట్లకుపైగా టర్నోవర్‌తో నడుస్తుందని, ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, అన్నిరకాల రుణాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. సభ్యుల వాటా మూలధనంపై అత్యధికంగా డివిడెంట్ 18శాతం కలిగ ఇఉందని అన్నారు. ఖమ్మం, కొత్తగూడెంతో పాటు మహబూబాబాద్ వరంగల్, కరీంనగర్, సూర్యాపేట జిల్లాలో తమ బ్యాంకు సేవలు కలిగి ఉన్నాయని, త్వరలో మరో 5 జిల్లాలలో కూడా నూతన శాఖలకు ఆర్‌బీఐ ఆమోదం తెలిపిందని అన్నారు. భవిష్యత్తులో కూడా అత్యుత్తమ ప్రమాణాలతో ఖాతాదారులకు సేవలు అందిస్తామని సీఈవో దాసరి వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ఉదయ్ ప్రతాప్, మేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు బులుసు సాంబమూర్తి, దేవతరాజారావు, కె. నర్మద, కె. జయప్రద, మద్ది పిచ్చయ్య, పి, శిల్ప, రేఖల భాస్కర్‌రావు, డీసీఎం ఎవీఎస్ ప్రసాద్, మేనేజర్లు శ్యామ్, రామారావు, ఎంపీ సత్యనారాయణ, సిబ్బంది నర్సింగరావు, ఇతర మేనేజర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ కృష్ణమూర్తి


చైర్మన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రేపు ఉచిత వినికిడి వైద్య పరీక్ష శిబిరం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

సత్తుపల్లి, అక్టోబరు 4: లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు ఉచిత వినికిడి వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దారా కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని శ్రీ బాలాజీ థియోటర్ పక్కనున్న గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. వినికిడి సమస్య ఉన్న 5ఏళ్ల లోపు వయసు గల పిల్లలకు ఏడీఐపీ పథకం కింద ఉచిత కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు జరుగుతాయన్నారు. ఇంకా వినికిడి యంత్రంతో పూర్తి లబ్ధిపొందని వారు, రెండు చెవులలో తీవ్ర వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించబడిన వారు, ఆధునిక చికిత్సా విధానంపై అవగాహన లేనివారు, వయసు తగిన విధంగా మాట్లాడలేని వారిని ఈ శిబిరానికి తీసుకురావాలని కోరారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి చెందిన 8మంది వైద్య బృందం, 4టెక్నీషియన్లచే ఈ శిబిరం నిర్వహించనున్నామని, సుమారు రూ.30లక్షల విలువగల శస్త్రచికిత్సలు పూర్తిగా ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. ఏడీఐపీ చికిత్స కోసం పిల్లల డేట్ ఆఫ్ సర్టిఫికేట్, పిల్లలతో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డ్, సదరం సర్టిఫికేట్, 2పాస్‌ఫోటోలు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంకా మెడికల్ రిపోర్టుల జిరాక్సులను వెంట తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెనుగొండ రమేష్, దాసరి ఉమామహేశ్వరరెడ్డి, పీడీ.శ్రీనివాస్‌రెడ్డి, చల్లగుళ్ల అప్పారావు, కూసంపూడి మురళీ, గండ్ర సోమిరెడ్డి, గోగడ రవి, ఎంవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ వైరా, సత్తుపల్లి, కల్లూరు కార్యవర్గం ఎన్నిక

వైరా/సత్తుపల్లి/తల్లాడ, అక్టోబరు 4: టీఎన్‌జీవోస్ వైరా యూనిట్ ఎన్నికలు శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగాయి. ఈ ఎన్నికల అధికారిగా గుర్రం ధనలక్ష్మీ వ్యవహరించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా తన్నీరు ప్రవీణ్, దొండా అనంతరాములు, కోశాధికారిగా గుగులోతు వాల్యాతో పాటు 12మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా కోకన్వీనర్ కొణిధన శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు పొట్టపింజర రామయ్య. గంగవరపు బాలకృష్ణ, సభ్యులు జడ్ఎస్.జైపాల్, కొమరిగిరి దుర్గాప్రసాద్. కె.లలితకుమారి, గుంటపల్లి శ్రీనివాస్, పెద్దినేని రాధాకృష్ణ, సగ్గుర్తి ప్రకాశరావు, యర్రా రమేష్, కందుల విజయ్, రాములు, ఆశాజ్యోతి అభినందించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

సత్తుపల్లిరూరల్: టీఎన్‌జీవోస్ నూతన కమిటీ ఏకగ్రీవమైంది. నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా చింతకాయల కృష్ణ, చీకటి చైతన్య ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ప్రతిష్ఠాత్మకమైన టీఎన్‌జీవోస్ సత్తుపల్లి యూనిట్ ఎన్నికలకు సంబంధించి సింగిల్ సెట్ నామినేషన్ రావడంతో కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి పీ.లక్ష్మీనారాయణ తెలిపారు. కోశాధికారిగా పగిడిపల్లి అయోధ్యతో పాటు మరో 12మంది సభ్యులు నియమితులయ్యారు. ఈ కమిటీ పదవీ కాలం మూడేళ్లు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కో-కన్వీనర్ కొణిదెల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పొట్టపెంజర రామయ్య, సభ్యులు జయపాల్, దుర్గాప్రసాద్, లలితకుమారి, గుంటుపల్లి శ్రీనివాస్, రాధాకృష్ణ, ప్రకాశరావు, రములు, దారుగాబీ, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: టీఎన్‌జీవోస్ కల్లూరు యూనిట్ అధ్యక్షుడిగా హెల్త్‌సూపర్‌వైజర్ కొత్తా పెద్దపుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం టీఎన్‌జీవోస్ కల్లూరు యూనిట్ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా జి.విజయ్‌కుమార్, కోశాధికారిగా వి.వెంకటరమణతోపాటు మరో 12మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వి.భాస్కర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ కొణిధన శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు పొట్టపింజర రామయ్య పాల్గొన్నారు.

వైరాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటన


ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

వైరా, అక్టోబరు 4: మండలంలోని అష్ణగుర్తి, రెబ్బవరం గ్రామాల్లో శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అష్ణగుర్తి రామాలయంలో రూ.పదిలక్షల టీటీడీ నిధులతో నిర్మించే మండపానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అంతకముందు రెబ్బవరంలో ఓ ప్రైవేట్ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, అష్ణగుర్తి, రెబ్బవరం మాజీ సర్పంచ్‌లు కొణిధన కోటేశ్వరరావు, ఇటుకల మురళీ, దాసరి దానియేలు, గుత్తా కళావతి, నాయకులు గుత్తా రామారావు, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, వెంపటి నాగేశ్వరరావు, రేమల్లె నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

కారేపల్లి: మండల పరిధిలోని బొక్కలతండాగ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 70కుటంబాలకు చెందిన వారు శుక్రవారం వైరాలోని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి ఆయన పార్టీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ నారాయణ, హేమ్లా తదితరులు పాల్గొన్నారు.

దాత సాయంతో తాగునీటికి బోర్లు, మోటారు ఏర్పాటు

ఎర్రుపాలెం, అక్టోబరు 4: మండలంలోని భీమవరం గ్రామంలో ఆదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత యరమల పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు శుక్రవారం బోరు, మోటారు ఏర్పాటుచేశారు. భీమవరం హరిజనవాడలోని వైకుంఠధామంలో చేతిపంపునకు మరమ్మతులు చేయించారు. తాగునీటి ఇక్కట్లు, గ్రామ సమస్యలపై స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన దాత పూర్ణచంద్రారెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞత తెలిపారు ఈకార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, గుర్రాల శ్రీనివాసరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

కల్లూరు, అక్టోబరు 4: మండలంలోని చిన్నకొరుకోండి గ్రామంలో శుక్రవారం శ్రీ కనకదుర్గ యూత్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసీమియా బాధితులకు రక్తం దానం చేసే క్రమంలో ఈ శిబిరాన్న ఏర్పాటు చేసినట్లు క్యాపు నిర్వాహకులు కొంగర రామకృష్ణ తెలిపారు. కల్లూరులోని వేంకటేశ్వర డయాగ్నోస్టిక్ వారిచే ఈ శిభిరంలో పలువురు యువకుల నుంచి రక్తం సేకరించారు. సేకరించిన రక్తాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదాతలు కంభంపాటి హరికృష్ణ, పవన్‌కళ్యాణ్, మన్మద కృష్ణ, పవన్‌కుమార్, నాని, ఉపేంద్ర, చినాల రవి, పసుపులేటి నాని, ఇటి అవినాష్, సీతరాం ప్రసాద్, నవీన్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

ఖమ్మం, ఖానాపురంహవేలి అక్టోబరు 4: ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదోతరతి, ప్రభుత్వ రిక్కాబర్ పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు పరిశీలించారు.

20న 'హోలికులు సేమమా' నాటిక

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 4: నెలనెల వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో హోలికులు సేమమా నాటిక ప్రదర్శించనున్నారు. ఖమ్మం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించే ఈనాటిక రచన జరుగుల రామారావు, కొమ్మాప్రాద్, దర్శకత్వం కె.దేవేంద్ర

త్వరలో జిల్లా సమగ్రస్వరూపం పుస్తకం

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 4: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జిల్లా సమగ్ర స్వరూపంపై త్వరలో పుస్తకం వెలువరించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ వురిమళ్ల సునంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించిన భౌగోళిక, నైసర్గిక, పర్యాటక, కళా, సాహిత్య, క్రీడా, రాజకీయ, పారిశ్రామిక, తదితర ప్రధాన రంగాలను విశ్లేషిస్తూ జిల్లాకు చెందిన ప్రముఖుల వ్యాసాలతో ఈ పుస్తకాన్ని వెలువరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమపర్యవేక్షణకు కోర్ కమిటీని ఏర్పాటు చేశామని, త్వరలో వర్క్‌షాప్‌ను నిర్వహించి వ్యాసాల బాధ్యతను అప్పగిస్తామన్నారు.

రాహుల్‌ను విమర్శించే స్థాయి పవన్ కల్యాణ్‌కు లేదు: కాంగ్రెస్

నేలకొండపల్లి, అక్టోబరు 4: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేదని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంజని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. జనసేన సెక్యులర్ పార్టీ అనుకున్నామని, కానీ పవన్ కల్యాణ్ కూడా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతోనే ముందుకు సాగుతున్నారన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులను ఊచకోత కోస్తుంటే పవన్ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. పవన్ ఇప్పటికైనా మోదీ మాయ నుంచి బయటకు రావాలని అంజని కోరారు.

అడవులు, వన్యప్రాణులు, పర్యావరణంపై అవగాహన

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 4: అడవులు, వన్యప్రాణులు, పర్యావరణంపై అవగాహన అధికారులతో పాటు ప్రజలు కలిగి ఉండాలని ఫారెస్ట్ రేంజర్ పీ.స్నేహలత అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని రేగళ్లపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పిచ్చేశ్వరరావు, ఎఫ్ఎస్‌వోలు వేణు, అరుణ్, నరసింహా, నాగరాజులతో పాటు బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి: టీడీపీ

తిరుమలాయపాలెం, అక్టోబరు 4: ఇటీవల అకాల వర్షాలతో రైతుల పంటలు పూర్తిగా నాశనమయ్యాయని వారికి పంట నష్టపరిహారం చెల్లించాలని టీడీపీ జిల్లానాయకులు కొండబాల కరణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఎన్నడు లేని విధంగా భారీవర్షంతో లతక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి రైతులనుఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నామా ప్రసాద్, కొప్పులు వెంకటరావు, మల్లీడి భాగ్యమ్మ, రమేస్,నాగన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 4: పేద కుటుంబానికి చెందిన ఓ విద్యార్థి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో ఖమ్మం నగరానికి చెందిన రిక్కాబజార్ పాఠశాల ఉపాధ్యాయురాలు సైదారాణి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యురాలు మల్లూరిలు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వరరావు విద్యార్థి పానం శ్రీహర్షితకు అందించారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్ సభ్యులు నరసింహారావు, శ్రీధర్‌బాబు, పీఆర్టీయూ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు డిజిటల్ సర్వే

మధిరటౌన్, అక్టోబరు 4: రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు క్రింద కుటుంబ నిర్ధారణ కోసం చేపట్టిన డిజిటల్ సర్వే మధిర మునిసిపాలిటీ లోని 17వ వార్డులో శుక్రవారం రెండో రోజు కొనసాగింది. మొత్తం 354 కుటుంబాలు ఉన్న ఈ వార్డులో తొలిరోజు 160 కుటంబాల డిజటల్ సర్వేను పూర్తిచేసిన సిబ్బంది మిగత కుటుంబాల సర్వేను నిర్వహించారు. ఖమ్మం ఆర్డీఓ గణేష్ సర్వేను పరిశీలించి నిర్ధారిత పార్మెట్ లో కుటుంబ సభ్యుల వివరాల నమోదును పరిశీలించి తప్పులను చూపి ఎలా పూర్తి చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ డేవిడ్, ఆర్ఐ భాను, వేణు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 62మంది ఎస్ఏ, ఎస్జీటీలకు అర్హత

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 4: నగరంలోని బీసీ సంక్షేమశాఖ, బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో 2023-24లో నిర్వహించిన డీఎస్సీ ఎస్‌జీటీ, ఎస్ఏల ఉచిత శిక్షణ పూర్తిచేసుకున్న 259మంది అభ్యర్థులల్లో 62మంది ఎస్‌జీటీ, ఎస్ఏలకు అర్హత సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. శ్రీలత తెలిపారు. వారిలో బొడ్డుపల్లి పెద్దిరాజు స్కూల్ అసిస్టెంట్‌లో ఇంగ్లీస్ మొదటి ర్యాంకుతో పాటు మరికొంతమంది ఎస్‌జీటీల్లో కె.నాగభూషణం 5వర్యాంకుతో పాటు పలువురు అభ్యర్థులు అత్యుత్తమ ర్యాంకులు సాదించారని తెలిపారు. వీరిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, బీసీ సంక్షేమశాఖ అధికారి జి.జ్యోతి అభినందించారు.

మంత్రి తుమ్మల కృషితో నగరం వేగంగా అభివృద్ధి: మేయర్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి జరుగుతుందని, ప్రతి వాడకు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం 12వ డివిజన్‌లో వన సంరక్షణలో బాగంగా స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం రూ. 5లక్షల సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ 12వ డివిజన్‌లో సమస్యలు చెప్పిన వెంటనే రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక నిధులు కేటాయించారని మంత్రికి మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, సరిపూడి సతీష్, పాలేపు వెంకటరమణ, పాలకుర్తి నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించండి: భగీరథ డీఈఈ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 4: మరమ్మతులకు గురైన మోటార్లను మీరే చేసుకుని లీకేజీలను సరిచేసుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని మిషన్ భగీరథ డీఈఈ కే.జయలక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో పెనుబల్లి మండలానికి చెందిన తాగునీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనర్‌తో నిర్వహించి అవగాహన కల్పించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎవరి వారే అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుని స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా సెలవులు ఇవ్వని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 4: దసరా సెలవులను సంపూర్ణంగా అమలు చేయాలని, అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట పలువురు ప్రవేటు ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేసి డీఈవోకు వినతి పత్రం అందించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

చింతకాని, అక్టోబరు 4: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం చింతకాని, కొణిజర్ల మండలాల విద్యుత్ వినియోగదారులకు లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలచారి తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్దరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, ఓల్టేజ్ హెచ్చుతగ్గలు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, రద్దు తదితర సమస్యలపై విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు సమర్పించవచ్చునని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించబడునన్నారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీమా సొమ్ము అందజేత

ఖమ్మం రూరల్/ఖమ్మం మామిళ్లగూడెం అక్టోబరు 4: మండల పరిదిలోని తల్లంపాడు గ్రామానికి చెందిన మూడు కుటుంబాల వారికి మంజూరయిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం సొమ్మును ఖమ్మం డివిజన్ పోస్టాఫీసర్ సుపరిండెంట్ వీరభద్రం శుక్రవారం బాదితులకు అందజేశారు. వినోద, శైలజ, పద్మకి ఒక్కొక్కరికి మంజూరయిన రూ. 2 లక్షల బీమా సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లంపాడు సబ్ పోస్టుమాస్టర్ సైదబావు, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల ఫోరం సభ్యుడిగా రామారావు


రామారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 4: తెలంగాణ విద్యుత్‌శాఖ వినియోగదారుల ఫోరం సభ్యుడిగా జిల్లాకు చెందిన మందనపు రామారావును తెలంగాణ విద్యుత్ రెగ్యూలేటరి కమిటీ ఎన్నిక చేసింది. ఈ మేరకు మందనపు రామారావుకు శుక్రవారం సర్క్యూలర్ అందింది. రామారావు విలేకర్లతో మాట్లాడుతూ తాను భారతీయ కిషాన్ సంఘ్ జోనల్ కార్యదర్శిగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్నా అని తెలిపారు. 1997 నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కార్యకర్తగా క్రమశిక్షణతో సభ్యత్వం ఉందన్నారు. ఏబీవీపీలో పదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. విద్యుత్ వినియోగదారుల ఫోరం సభ్యునిగా బాధ్యతలు రావటంతో నేరుగా రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కారానికి అవకాశం కలిగిందన్నారు. ఫోరం సభ్యునిగా రైతులకు సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటానన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు


త్రివేణి పాఠశాలలో


గీతాంజలిలో..


ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో..


హైనిటాట్స్‌లో..